క్లుప్తంగా

చైర్మన్ పదవికి రాజీనామా


పర్లప్ప గారి భాగ్యమ్మ

పెద్దకడబూరు: ఆంధ్రప్రదేశ్ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు చైర్మన్ పదవికి పర్లప్ప గారి భాగ్యమ్మ ఆదివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఓటమికి నైతిక బాధ్యతగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాజీనామా లేఖను ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా తాను, తన భర్త (మాజీ ఎంపీపీ) రఘురాముడు వైఎస్సార్‌సీపీ వెంట ఉండి పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడకుండా గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కలసికట్టుగా శ్రమిద్దామన్నారు. నాలుగవ సారి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని గెలిపించినందుకు మంత్రాలయం నియోజకవర్గం ప్రజలకు, పెద్దకడబూరు మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

కళాకారులకు సన్మానం

ఆదోని అర్బన్: ఆదోనిలోని మంగళ ఆంజనేయస్వామి ఆలయంలో ఎన్నో సంవత్సరాలుగా స్వామివారికి సేవలు చేస్తున్న కళాకారులను ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు టైలర్ రమేష్, దేవస్థాన అధ్యక్షులు గౌడ్ ఈరన్న ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక ఆలయ ప్రాంగణంలో లలిత కళాసేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ జి.నల్లారెడ్డి, గౌడ్ ఈరన్న, ప్రముఖ సంగీత హార్మోనిస్టు ఉరుకుందప్పలను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాన్ని సుందరంగా నిర్మించిన కళాకారులు ప్రతిభ వెలకట్టలేనిదన్నారు. వారు నిర్మించిన కళ అశాశ్వతమైనదని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు, దేవాలయ సభ్యులు ఓంకార్‌గౌడ్, ఈరన్న, రమేష్, మల్లప్ప, కృష్ణ, లక్ష్మయ్య, నాగయ్య, రాముడు, రాము తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లప్ప

ఆదోని సెంట్రల్: ఉమ్మడి కూటమిలో భాగంగా ఎమ్మెల్యే పార్థసారథి నాయకత్వంలో కలసికట్టుగా ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లప్ప పేర్కొన్నారు. ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దేశ ప్రధానమంత్రిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబునాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి బలపరిచిన అభ్యర్థి డాక్టర్ పార్థసారథిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేశారన్నారు. ఎవరి అపోహాల కు తావు లేకుండా ఆయా పార్టీల నాయకులను కలుపుకుని సమష్టిగా పని చేస్తామని తెలిపారు.

ఆదోని కళాకారులకు అవార్డులు


అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్

ఆదోని అర్బన్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక కళా సాజన్యంతో గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదోనికి చెందిన సోదరులకు శ్రీకాంత్ (చిత్ర కళాకారుడు), అశోక్ శ్రీనాథ్ (సూక్ష్మ కళాకారుడు)కి బీసీ కమిషన్ చైర్మన్ వి.కృష్ణమోహన్, ప్రముఖుల చేతులమీదుగా బంగారు నంది అవార్డులను ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ.. తమ ప్రతిభకు అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు.నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మోటార్ సైకిళ్లు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరం గ్రామ సమీపంలో ఆదివారం రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఒకరు తీవ్రగా గాయపడ్డారు. వెల్దుర్తి మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన మనోజ్ రుద్రవరం మండలంలోని ఆలమూరులో ఉన్న బంధువుల ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఆర్.నాగులవరం సమీపంలో వెళ్తుండగా ఎదురుగా మరో వ్యక్తి మోటార్ సైకిల్‌పై రుద్రవరం వైపు వెళ్తుండగా అదుపు తప్పి రెండు బైక్‌లు ఎదురుగా ఢీ కొన్నాయి. దీంతో మనోజ్‌కు తీవ్ర గాయాలు కాగా..వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

జీవన ఎరువులతో విశేష ప్రయోజనాలు

ఎమ్మిగనూరురూరల్: వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం నానాటికీ పెరిగిపోతుందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అశోక్‌కుమార్ చెప్పారు. దీని వల్ల నేల సారం కోల్పోవడమే గాక రసాయన అవశేషాలు పంట దిగుబడిలో ఉండిపోయి అనారోగ్యం కలగజేస్తున్నాయి. భూమిలోని సూక్ష్మజీవుల సంఖ్య తగ్గుతూ నేలకు ఉన్న సహజ గుణాలు, సారం క్షీణిస్తుంది. పర్యావరణ కాలుష్యంతో పాటు రైతులకు పెట్టుబడి ఖర్చు పెరుగుతుంది. ఈ నేపథ్యంలో సేంద్రియ ఎరువుల వాడకంతో పాటు జీవన ఎరువుల వాడకం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. వీటి వల్ల కలిగే ప్రయోజనాలను కేవీకే శాస్త్రవేత్తలు వివరించారు.

నత్రజనిని స్థిరీకరించే జీవన ఎరువులు

1.రైజోబియం, 2.అజటోబాక్టర్, 3.అజోస్పైరిల్లమ్, 4.నీలి ఆకుపచ్చనాచు, 5.అజోల్లా-అనాబినా, 6.అసిటో బాక్టర్, 7.ఫ్రాంకియా ముఖ్యమైనవి.

రైజోబియం: లెగ్యూమ్/పప్పు జాతి పంటలకు నత్రజనిని అందించే జీవన ఎరువుగా వాడాలి. కంది, పెసర, మినుము, శనగ, వంటి పైర్లకు, వేరుశనగ, సోయాచిక్కుడు వంటి నూనె గింజల పైర్లకు రైజోబియం కల్చర్‌ను విత్తనాలకు పట్టించి ఉపయోగించాలి. దీని వల్ల మొక్క వేర్లపై లేత గులాబి రంగు బుడిపెలు ఏర్పడతాయి. ఈ బుడిపెలలోని రైజోబియం గాలిలోని నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందిస్తుంది.

ఉపయోగించే విధానం: 100 మి.లీ నీటిలో 10 గ్రాముల పంచదార/బెల్లం లేదా గంజి పౌడర్‌ను కలిపి 10 నిమిషాలు మరగబెట్టి చల్లార్చాలి. ఈ ద్రావణం 10 కిలోల విత్తనాలపై చల్లి, దానికి 200 గ్రాముల రైజోబియం కల్చర్ పొడిని బాగా పట్టించి విత్తనం చుట్టూ పొరలా ఏర్పడేలా చూడాలి. పాలిథీన్ సంచి లేదా, ప్లాస్టిక్ తొట్టిలో ఈ ప్రక్రియ చేయవచ్చు. తర్వాత విత్తనాలను 10 నిమిషాలు నీడలో ఆరబెట్టి పొలంలో నాటుకోవాలి.

అజటోబాక్టర్: పప్పుజాతి పంటలను మినహాయించి మిగతా అన్ని పంటలకు నత్రజని జీవన ఎరువుగా ఉపయోగపడుతుంది. ఈ బాక్టీరియా నత్రజనిని స్థిరీకరించడమే గాక మొక్కకు కావాల్సిన పోషకాలను అందిస్తుంది. ఆకుకూరలు, కూరగాయలు,పూలతోటల సాగుకు ఈ విధానం అనుకూలం.

వాడే విధానం: 2 కిలోల కల్చర్‌ను 200 కిలోల సేంద్రియ ఎరువులో కలిపి విత్తనం నాటే సమయంలో ఒక ఎకరం నేలపై వెదజల్లవలెను. భూమిలో తగినంత తేమ ఉండాలి.

అజోస్పైరిల్లమ్: ఈ బాక్టీరియా మొక్క వేర్లచుట్టూ పెరుగుతుంది. ఈ జీవన ఎరువును లెగ్యూమ్ జాతి పంటలకు తప్పించి మిగతా పంటలైన వరి, పత్తి, మిరప, జొన్న, సజ్జ, ప్రొద్దుతిరుగుడు, అరటి తదితర పంటలకు వాడుకోవచ్చు.

వాడే విధానం: తక్కువ కాలం పంటలకు 2 కిలోల అజోస్పైరిల్లమ్ కల్చర్‌ను 80-100 కిలోల సేంద్రియ ఎరువులో కలిపి వేసుకోవాలి. నారుమడి పంటలకు 70-80 లీటర్లు పట్టే చిన్న మడిని తయారు చేసుకోవాలి. ఆ నీటిలో 2 కిలోల అజోస్పైరిల్లమ్ ఎరువును కలిపి ఆ ద్రావణంలో 10 నిమిషాలు వేర్లను మాత్రమే ముంచి వెంటనే నాటుకోవాలి.

నీలి ఆకుపచ్చ నాచు (సైనో బాక్టీరియా): ఇది వరికి మాత్రమే ఉపయోగపడే నత్రజనిని సంబంధిత ఎరువు. ఈ జీవన ఎరువులో నాస్టాక్, ఎనాబినా, కెలోర్థిక్స్ మొదలైన సైనో బాక్టీరియాలు ఉంటాయి.

వాడే విధానం: ఒక ఎకరం పొలంలో వరినాట్లు వేసిన 3-7 రోజుల వ్యవధిలో 4 నుంచి 6 కిలోల జీవన ఎరువును 40-50 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి చల్లాలి. ఇది వేసిన 15-20 రోజులలో నాబు అల్లుకుపోయిన తర్వాత నీటిని తొలగించి నాచును మట్టిలో కలిసేటట్లు చేయాలి.


వేర్లపై రైజోబియం బుడిపెలు

అజొల్లా: ఈ జీవన ఎరువు నీటిపై తేలియాడుతూ వరి పొలంలో పెరిగే ఫెర్నోజాతి మొక్క. ఈ జీవన ఎరువు ఒక నత్రజనిని మాత్రమే గాక, సేంద్రియ కర్బనం, పోటాషియంను వరి పైరుకు అందిస్తుంది.

వాడే విధానం: వరి నాటిన వారం తర్వాత సమారు 200 కిలోల అజోలా జీవన ఎరువును ఒక ఎకరంలో వెదజల్లి 15-20 రోజులు నీటిపై పెరగనివ్వాలి. తర్వాత నీటిని తొలగించినచో ఇది 3-4 రోజులలో కుళ్లిపోయి మొక్కకు పోషకాలను అందిస్తుంది.

అసిటో బాక్టర్: ఇది చెరుకు పంటకు షుగర్ బీట్ వంటి పంటలకు మాత్రమే ఉపయోగపడుతుంది. ఈ ఎరువు మొక్క వేర్లలోనే గాక పైభాగములో కూడా జీవించి నత్రజనిని మొక్కలకు అందిస్తుంది.

వాడే విధానం: ఒక ఎకరం చెరుకు పంటకు 4 కిలోల జీవన ఎరువును రెండు దఫాలుగా వాడాలి.

ఫ్రాంకియా: ఇది ఎక్టినో మైసిటిస్ జాతికి చెందిన సూక్ష్మాంగ జీవి. దీన్ని సరుగుడు చెట్లకు మాత్రమే వాడాలి.

భాస్వరంను అందించే జీవన ఎరువులు

పంట మొక్కలకు వేసిన లభ్య భాస్వరం భూమిలో చేరిన కొద్దిరోజులలో భూమి ఉదజని సూచికను అనుసరించి, వివిధ రూపాల్లోకి మారిపోతుంది.

ఫాస్ఫో బాక్టీరియా: ఈ జీవన ఎరువు అన్ని పంటలకు వాడవచ్చు.ఇది బాగా పనిచేసేందుకు సేంద్రియ కర్బనం అత్యవసరం. ఎరువుతో పాటు కలిపి వాడాలి. మొక్కలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

వాడే విధానం: ఎకరాకు 2 కిలోల ఫాస్ఫో బాక్టర్‌ను 200 కిలోల పశువుల ఎరువులో కలిపి దుక్కిలో మొక్క సాళ్లలో పడేటట్లు వేయాలి. తగినంత తేమ ఉండాలి.

ఫాస్ఫో ఫంగై: అన్ని పంటలకు వాడుకోవచ్చు. దీని ద్వారా మొక్కకు భాస్వరం అధికంగా లభిస్తుంది.

వాడే విధానం: 2 కిలోల జీవన ఎరువును 100 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి ఒక ఎకరం నేలకు విత్తనం నాటిన సాళ్లలో పడేటట్లు వేయాలి.

వాడే విధానం: కనీసం 5 కిలోలను ఒక ఎకరం భూమికి వేయాలి. తప్పనిసరిగా విత్తనం, మొక్క కింద పడేటట్లు వేయాలి.

పోటాషియం మొబిలైజర్స్: దీని ద్వారా మొక్కకు తగినంతం పోటాషియం లభిస్తుంది. 'ప్ర టూరియా అర్షానిమ' అనే బాక్టీరియా పోటాషియం మొబిలైజర్‌గా పనిచేస్తుంది. దీనితో పాటు కొన్ని బాసిల్లస్ జాతులు కలిపి మిశ్రమంగా తయారు చేస్తున్నారు.

వాడే విధానం: 2 కిలోల జీవన ఎరువును 100 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి ఒక ఎకరా భూమిలో చల్లుకోవాలి. నూనె పంటలలో దీని ప్రభావం బాగా ఉంటుంది.

జింక్ మొబిలైజర్స్: ఈ జీవన ఎరువు కొన్ని బాసిల్లస్ స్పిసీస్ ఉపయోగించి ఈ మధ్య కాలంలో ప్రైవేటు సంస్థలు తయారు చేస్తున్నాయి. వీటి ప్రభావం వరి, మొక్క జొన్న పంటలపై కొంత వరకు ఉంటుంది.

వాడే విధానం: ఒక ఎకరాకు 2 కిలోల ఈ జీవన ఎరువను 100 కిలోల పశువుల ఎరువుతోగానీ, వాన పాముల ఎరువుతోగానీ, విత్తనం నాటుకొనే సమయంలో వెదజల్లవలెను. ఇవేకాక ద్రవరూపంలో ఉన్న జీవన ఎరువులు కూడా లభ్యమవుతున్నాయి. వీటిని ఒక ఎకరం పొలంలో 300 మి.లీ నుండి 500 మి.లీ వరకు ఒక్కో రకపు జీవన ఎరువును మిశ్రమ ద్రావణంగా వాడాలి.

జీవన ఎరువుల వాడకంలో జాగ్రత్తలు

- జీవన ఎరువు ప్యాకెట్ ఎండ వేడి తగలని చల్లని నీడ ప్రదేశంలో నిల్వ ఉంచాలి.
- రైతు వాడే జీవన ఎరువు ఆ పంటకు సరైనదై ఉండాలి. ప్యాకెట్‌పై ఉన్న గడువు తేదీలోపు మాత్రమే ఉపయోగించాలి. రసాయనాలతో విత్తన శుద్ధి చేసేటప్పుడు విధిగా 24-48 గంటల వ్యవధి ఉండాలి. రసాయన ఎరువులతో కలపి జీవన ఎరువులు వాడరాదు. సమర్థవంతంగా పని చేసేందుకు నాణ్యతగల కల్చర్‌ను వాడాలి. పొలంలో తగినంత తేమ ఉన్నప్పుడు మాత్రమే వేసుకోవాలి. సేంద్రియ ఎరువుతో కలిపిన వెంటనే పంటకు వాడుకోవాలి.
- ఈ జీవన ఎరువులను అమరావతి వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి లేదా రాజేంద్రనగర్‌లోని ప్రాంతీయ సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీ నుంచి పొందవచ్చును.

దళారులను నమ్మి మోసపోవద్దు


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు ప్రకాష్‌జైన్

ఆదోని అర్బన్: పట్టణంలో కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్, కాంట్రాక్ట్ మిడ్‌డే మీల్స్ తదితర ఉద్యోగాలను ఇప్పిస్తామని చెబుతూ సొమ్ము చేసుకుంటున్న దళారులను నమ్మవద్దని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ప్రకాష్‌జైన్ సూచించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన పార్థసారథి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఆయన్ను సంప్రదించి సమావేశం ఏర్పాటు చేసుకుని తదనంతరం ఎవరికి ఏమి ఇవ్వాలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పే వారి మాయమాటలను నమ్మవద్దని సూచించారు. నమ్మి డబ్బులు ఇస్తే జేబులు ఖాళీ చేసుకోవాల్సిందేనని, ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. ప్రస్తుతం మిడ్ డే మీల్స్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితర కాంట్రాక్ట్ పోస్టుల్లో ఉన్న వారు అవినీతికి పాల్పడకుండా నిజాయితీగా పనిచేసి ఉంటే వారినే కొనసాగిస్తామని తెలిపారు. అవినీతికి పాల్పడిన వారిని వెంటనే తొలగిస్తామని చెప్పారు. గత ఎన్నికల ముందు సీటు కోసం రూ.3 కోట్లు బేరసారాలు సాగించిన బీజేపీ నేతలను సస్పెండ్ చేసేవరకు వదిలే ప్రసక్తేలేదన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న ఎస్టీయూ మాజీ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న



ఎస్టీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదోని సెంట్రల్: ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ యూనియన్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా నాయకులు పి.నాగేంద్రప్ప అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రమేష్ నాయుడు హాజరై ఎస్టీయూ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీయూ సంఘం 1947 జూన్ 9వ తేదీన ఆవిర్భవించిందన్నారు. ఉపాధ్యాయ ఉద్యమ ప్రస్థానంలో 77 సంవత్సరాలు పూర్తిచేసుకుందని తెలిపారు. ప్రభుత్వ విద్యను పరిరక్షిస్తూ ఉపాధ్యాయుల సమస్యల సాధనకై నిరంతరం పోరాటం చేసిందని వివరించారు. ఎస్టీయూ పోరాటల ఫలితంగా అప్రెంటీస్ విధానం నుంచి విముక్తి కలిగించి స్పెషల్ టీచర్ల ఇంక్రిమెంట్లు సాధించినట్లు తెలిపారు. ఎస్టీయూ నాయకులు లోక్యనాయక్, జి.రవిచంద్రయాదవ్, రవి, భీమరాజ్, శ్రీనివాసులు, తిమ్మప్ప, అయ్యప్ప, కాశీ విశ్వనాథ్, జంబులయ్య, ప్రసాద్, హనుమన్న, నారాయణ, జ్యోతిమూర్తి, ప్రసాద్, ఉరుకుందప్ప, రాముడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల ఫలితమే ప్రస్తుత సౌలభ్యాలు


ఎమ్మిగనూరు టౌన్: 77 ఏళ్ల ఉద్యమ చరిత్ర కలిగి అనేక ఆందోళనలు, ప్రాతినిధ్యాలు చేసిన ఫలితమే నేడు ఉద్యోగులు అనుభవిస్తున్న సౌలభ్యాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీయూ తాలూకా కార్యాలయంలో సంఘం ఆవిర్భావ దినోత్సవ అడివన్న అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఎస్టీయూ జెండాను ఎగరవేసి సంఘ ప్రతిజ్ఞ చేయించారు. ఉద్యమ నాయకుల త్యాగనిరతిని కొనియాడుతూ ఇప్పటి తరం నాయకులు వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్లు బాబయ్య, అడివన్న, ఎల్లప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగభూషణం, తిమ్మరాజు, నాగరాజు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి వారి మూల విరాట్‌లకు సుప్రభాతం సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు. మరికొందరు భక్తులు ఆలయ మెట్లకు పసుపు కుంకుమ పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

21న ఎల్లార్తి దర్గాలకు టెండరు


ఎల్లార్తి దర్గా ముఖద్వారం

హొళగుంద: ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల ఏడాది నిర్వహణకు ఈ నెల 21న టెండరు నిర్వహిస్తున్నట్లు వక్ఫ్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ రెండు దర్గాలు, 38 రూములు, చందాపట్టి, చర్మ సేకరణ, చక్కర, హేర్ కటింగ్ తదితర వాటికి సీల్డ్ టెండరును జూన్ 7 నుంచి ఈ నెల 21వ తేది వరకు ఆహ్వానించారు. విజయవాడలో జరిగే సీల్డ్ టెండర్ ఓపెన్‌లో అత్యధికంగా కోట్ చేసిన వారు వేలం దక్కించుకోనున్నారు. వారికి వక్ఫ్‌బోర్డు అధికారులు నిర్వహణ గడువును తెలిపి దర్గాలను స్వాధీనం చేస్తారు. కాగా ఈ దర్గాలను 2014లో వక్ఫ్ బోర్డు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో నుంచి స్వాధీనం చేసుకుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దర్గాల నుంచి వక్ఫ్ బోర్డుకు రూ. కోట్లలో ఆదాయం వచ్చింది. ఇంత ఆదాయం వచ్చినా తాగునీరు, గదులు, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు కరువయ్యాయని భక్తులు ఆరోపిస్తున్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి

కోసిగి: కర్ణాటక రాష్ట్రం మాన్వి తాలుకా రాజోలి గ్రామంలో హజరత్ నేమతుల్లా ఖాద్రి 14వ ఉరుసు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం దర్గా మఠేఖేడ్ పీఠాధిపతి హజరత్ సయ్యద్ శాహా ముస్తాఫా ఖాద్రి నేతృత్వంలో దర్గాను ప్రత్యేకంగా ముస్తాబు చేసి ప్రత్యేక ఫతేహాలు నిర్వహించి ప్రార్థనలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మానవ ధర్మ చింతన సభ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మటమారి వీరభద్ర శివాచార్య, రాయచూర్ శాంతమల్లా శివాచార్య, సోమవారపేట అభినవ రాచోటేశ్వర శివాచార్య, విరక్త మఠ గురులింగ మహాస్వామి, మిట్టామల్కాపురం నిజానంద స్వామి, కుబేరప్ప తాత, తిమ్మాపురం స్వాములు దైవ వాక్యాలను ప్రసంగించారు.

శక్తిగుడిలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న నాయికులు

ఆదోని అర్బన్: దేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఫారెస్ట్ లైన్ శక్తిగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శృంగేరి మఠం ఆదోనిశాఖ పీఠాధిపతి విద్యాభినవ సుబ్రహ్మణ్య భారతిస్వామి, ఆదోని బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్ పాల్గొని మాట్లాడారు. ప్రజలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరిపాలనను మెచ్చి పట్టం కట్టారన్నారు. ఈ ఐదేళ్ల మోదీ పాలనకు ఎలాంటి విఘ్నాలు ఎదురుకాకుండా చూడాలని శక్తిమాతకు పూజలు నిర్వహించినట్లు చెప్పారు. అర్చకులు చిన్నప్పస్వామి, ఆలయ కమిటీ సభ్యులు కొంగే పంపాపతి, రామకృష్ణ, వీరన్న, టీడీపీ నాయకులు లక్ష్మన్న, బీజేపీ నాయకులు రమేష్ ఆచారి, దివిటీ సాయి, నాగరాజు, శ్రీకాంత్, నగేష్, పరమేష్, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


తుంగభద్ర నది సమీపంలో పడిఉన్న గుర్తు తెలియని మృతదేహం

మంత్రాలయం: మంత్రాలయం నది తీరాన బండరాళ్ల వద్ద ఆదివారం గుర్తు తెలియని మగ శవం పడిఉంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గోపీనాథ్ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మృతుడిని గుర్తు పట్టడానికి ఆయన దగ్గర ఎలాంటి ఆధారాలు గానీ, ఐడీ కార్డులు గానీ లేవన్నారు. ఎర్ర పంచ, ఎర్రని డ్రాయరు, ఎర్రని చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలన్నారు.

గోనెగండ్లలో మోస్తరు వర్షం


గోనెగండ్లలోని గద్వాల వీధిలో పొంగి ప్రవహిస్తున్న వర్షం నీరు

గోనెగండ్ల: గత నాలుగు రోజులుగా మండలంలో ఓ మోస్తారుగా వర్షం కురుస్తోంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం సుమారు అరగంట పాటు జోరుగా వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగులు ప్రవహించాయి. అలాగే లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వైఎస్సార్ సర్కిల్‌లో ఎమ్మిగనూరు - కర్నూలు ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతవారం కురిసిన వర్షానికి కొంతమంది రైతులు తమ పొలంలో దుక్కి దున్ని వేరుశనగ, పత్తి తదితర పంటలను సాగుచేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటల సాగుకు అనుకూలంగా ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు.


పాతికేళ్ల తర్వాత కలుసుకున్న కోసిగి జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక

కోసిగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-1998 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకున్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు తిరిగి కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుని ఆనందంగా గడిపారు. ఎవరెవరు ఏ వృత్తిలో ఉన్నారో ఏమి చేస్తున్నారో అని తెలుసుకున్నారు. వారి కుటుంబ సంక్షేమ బాధలను పంచుకున్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న వారు ఆర్థికంగా వెనకబడిన తోటి స్నేహితుల పిల్లల కోసం సహాయ సహకారాలు అందించాలని తీర్మానించారు. అలాగే జిల్లా పరిషత్ ఏర్పడి 75 వసంతోత్సవంలోకి అడుగు పెడుతోందని, ఏడాది పూర్తయ్యేలోగా పూర్వ విద్యార్థులందరూ కలిసి పాఠశాల వసంతోత్సవాలు జరుపుకుందామని పిలుపునిచ్చారు. ఆత్మీయ సమ్మేళనంలో 50 మందికి పైగా పూర్వ విద్యార్థులు కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్: భవన నిర్మాణ కార్మికులకు ఉచిత ఇసుక పాలసీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు గోవింద్, రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద ఉస్మాన్ వలి అధ్యక్షతన ఏపీ బిల్డింగ్ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు కరోనా వల్ల కోలుకోలేని దెబ్బపడిందని, అప్పటినుంచి కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది మంది కార్మికులు ఉపాధి లేక వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారని వాపోయారు. కొంతమంది ప్రమాదాలకు గురై మరణించారన్నారు. నూతన ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఆ సంఘం నాయకులు లాలుసాబ్, తిమ్మప్ప, వెంకటేశులు, రమేష్, సాలేసాబ్, తిమ్మారెడ్డి, ఉరుకుందు తదితరులు పాల్గొన్నారు.

చిన్నహరివాణంలో కుటుంబంపై దాడి

- ముగ్గురికి గాయాలు
- ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స


ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్యాభర్తలు ఈశ్వరమ్మ, వీరభద్రారెడ్డి

ఆదోని టౌన్: ఆదోని మండలం చిన్నహరివాణం గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఈశ్వరమ్మ, వీరభద్రారెడ్డి, వారి తనయుడు వీరేష్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శంకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, గిరిరెడ్డి, ఆనందరాజ్, శాంతరాజ్, నరసన్నతో పాటు మరి కొంతమంది ఆదివారం దాడులు చేశారు. గాయపడిన వీరభద్రారెడ్డి, ఈశ్వరమ్మ, వీరేష్‌రెడ్డిలను వారి బంధువులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బాధితుడు విలేకరులకు తెలిపిన వివరాల మేరకు.. చిన్నహరివాణం గ్రామంలో కొంతకాలంగా శివశంకర్‌రెడ్డి, వీరేష్‌రెడ్డి కుటుంబాల మధ్య ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. అయితే ఆదివారం శివశంకర్‌రెడ్డి తన అనుచరులతో ఏకంగా వీరేష్‌రెడ్డిపై దాడికి ప్రయత్నించారు. దాడిని అడ్డుకోబోయిన అతని తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, వీరభద్రారెడ్డిలపై దాడి చేశారు. శివశంకర్‌రెడ్డి చేసిన దాడిలో తల్లి, తండ్రి, కొడుకులకు రక్త గాయాలయ్యాయి. 'ప్రభుత్వం మాది. మేము చెప్పిన విధంగా వినాలి, లేదంటే పరిస్థితులు వేరుగా ఉంటాయని హెచ్చరించినట్లు బాధితుడు వీరేష్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. తమకు సంబంధించిన స్థలాన్ని ఇప్పించాలని అభ్యర్థించారు.